ఈనాడు, మెదక్

ఆదేశించినా మాకేంటి?

• పోర్టల్‌లో కనిపించని ప్రైవేటు పాఠశాలల రుసుముల సమాచారం

ప్రైవేటు పాఠశాలల్లో అధిక రుసుముల నియంత్రణే లక్ష్యంగా రాష్ట్ర విద్యాశాఖ పలు సంస్కరణలు తీసుకొస్తోంది. ఆయా వివరాలను తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ డా. నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి గతేడాది పాఠశాల ఆదాయ, వ్యయాలకు సంబంధించిన ఆడిట్ నివేదికతో పాటు తరగతుల వారీగా వసూలు చేస్తున్న ట్యూషన్ ఫీజుతో పాటు తదితర రుసుముల వివరాలను పాఠశాల పాలక మండలి (గవర్నింగ్ బాడీ) సభ్యుల సంతకాల ఆమోదంతో కూడిన పత్రాలను ఆయా యాజమాన్యాలు తప్పనిసరిగా నిర్దేశిత వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి. కానీ ఉమ్మడి జిల్లాలోని అత్యధిక ప్రైవేటు పాఠశాలలు ఆదేశాలను పట్టించుకోవడం లేదు. దీనికి తోడు కొన్నింట్లో గవర్నింగ్ బాడీల నియామకమే చేపట్టకపోవడంతో ఆడిట్ చేయడం లేదని తెలుస్తోంది.

మెదక్‌లో శూన్యం..

సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోని కార్పొరేటు స్కూళ్లలో ప్రాథమిక తరగతులకే రూ.60 వేల నుంచి రూ. లక్ష వరకు ఫీజులు ఉండటం గమనార్హం. నిబంధనల ప్రకారం కేవలం ట్యూషన్ ఫీజు మాత్రమే వసూలు చేయాలి. కానీ ఇతర పద్దుల కింద రూ.వేలల్లో గుంజుతున్నారు. ఇవన్నీ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే తమ బండారం బయటపడుతుందనే ఉద్దేశంతో వెనకడుగు వేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఒక్కరంటే ఒక్కరూ కూడా నమోదు చేయలేదు. రెండు రోజుల కిందట మెదక్ జిల్లా విద్యాధికారి ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి ఈ నెలాఖరులోపు వివరాలు వెల్లడించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిద్దిపేట విద్యాశాఖకు శాశ్వత అధికారి లేక సమీక్షించడం లేదు.

వివరాలు నమోదు చేసినవి..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	నమోదు
సంగారెడ్డి	825	1,65,987	6
సిద్దిపేట	242	94,329	3
మెదక్	118	65,432	0

ఊసే లేని పాలకమండళ్లు..

ఉమ్మడి జిల్లాలోని మెజారిటీ ప్రైవేటు పాఠశాలల్లో కొన్నేళ్లుగా ఆడిట్ నిర్వహించడం లేదు. దీనికి తోడు పాలకమండళ్ల నియామక ప్రక్రియ జోలికి వెళ్లడం లేదు. మెదక్ జిల్లాలో కేవలం నాలుగింట మాత్రమే కొన్నేళ్లుగా ఆడిట్ నిర్వహిస్తున్నారు. మిగిలిన 114 స్కూళ్ల యాజమాన్యాలకు అవగాహన లేకపోవడం గమనార్హం. ఇదే పరిస్థితి సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో నెలకొంది.

అధికారులు ఏమంటున్నారంటే..

ప్రైవేటు పాఠశాలల్లో రుసుములు, గవర్నింగ్ బాడీల వివరాల నమోదు ప్రక్రియలో జాప్యం గురించి మూడు జిల్లాల విద్యాశాఖ అధికారులను 'ఈనాడు' వివరణ కోరగా విద్యాశాఖ నిబంధనల ప్రకారం నమోదు చేయాల్సిందేనని వెల్లడించారు. నిర్దేశిత గడువులోపు నమోదు చేయని వాటికి నోటీసులు జారీచేస్తామని స్పష్టంచేశారు.

నేడు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అండర్-16 ఎంపిక పోటీలను ఆదివారం ఉదయం 10 గంటలకు సంగారెడ్డిలోని ఎంఎస్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రాజేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు సెప్టెంబరు 7 నుంచి హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. క్రీడాకారులు నేరుగా తరలిరావాలని కోరారు.

గణనాథుడికి ఘనస్వాగతం

వినాయక చవితికి మరో 14 రోజుల సమయం ఉంది. కానీ రామాయంపేటలో వేడుకలకు అప్పుడే నాంది పలికారు. శనివారం రాత్రి స్థానిక హిందూ యూత్ ఆధ్వర్యంలో గణేష్ ఆగమన్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భారీ గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు చేపట్టారు. యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

- న్యూస్‌టుడే, రామాయంపేట (చేగుంట)

నిధులు రావాలి.. పల్లె పరిఢవించాలి

న్యూస్‌టుడే, మెదక్, శివ్వంపేట

పాపన్నపేట గ్రామం

దేశ పురోగతిలో పల్లెలు కీలకపాత్ర పోషిస్తాయి. అలాంటి గ్రామాలు అభివృద్ధిలో వెనకడుగు వేస్తున్నాయి. వాటికి నిధుల లేమి, ప్రభుత్వాల సహకారం లేకపోవడమే ప్రధాన కారణాలు. ప్రతి ఏటా అందాల్సిన నిధులు సకాలంలో రాకపోవడం, దీనికితోడు ఆదాయం అంతంతే ఉండటంతో స్వయంగా పురోగతి సాధించలేకపోతున్నాయి. మరోవైపు వసతులు లేక కునారిల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో పాలనను పటిష్ఠం చేస్తూ పక్కా ప్రణాళికను రూపొందించి అనుసరించాల్సిన ఆవశ్యకత ఉంది.

ఆర్థిక సంఘం నిధులతోనే..

జిల్లాకు గత రెండేళ్లలో రాష్ట్ర ఆర్థిక శాఖ, కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.116.52 కోట్లు విడుదలయ్యాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించడం లేదు. దీంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. జిల్లాలోని అన్ని పంచాయతీలకు పన్నుల డిమాండ్ రూ.14.56 కోట్లుగా ఉంది. గ్రామాలకు వస్తున్న నిధులు ప్రతి నెలా ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపులకే సరిపోతున్నాయి. దీంతో ప్రగతి పనులకు వెచ్చించలేని పరిస్థితి.

జిల్లాలో ఇలా.. పంచాయతీ సిబ్బంది: 1697 చెల్లిస్తున్న వేతనాలు: రూ.1.61 కోట్లు

వైభవాన్ని కోల్పోతూ..

జిల్లాలో పల్లెలు వైభవాన్ని కోల్పోతున్నాయి. కనీస అవసరాలైన రహదారులు, మురుగు కాలువలు ఎప్పుడో నిర్మించినవి కావడంతో అధ్వానంగా మారాయి. పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. చాలా గ్రామాల్లో చెత్త సేకరణ అటకెక్కింది. పల్లె ప్రకృతివనాలు, క్రీడాప్రాంగణాలు నిర్మించినా వృథాగా మారాయి. డంపింగ్ యార్డులు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. 144 గ్రామాలకు పంచాయతీ కార్యాలయాలు మంజూరు కాగా, వివిధ దశల్లో ఉన్నాయి. 48 చోట్ల స్థలాల కొరత వేధిస్తోంది. 26 పంచాయతీలకు నిధులు రావాల్సి ఉంది.

జిల్లాలో ఇలా..
గ్రామపంచాయతీలు: 492
శాశ్వత కార్యాలయాలున్నవి: 351
ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నవి: 63
అద్దె భవనాల్లో..: 78

ఆదర్శంగా నిలిచేలా..

గతేడాది డిసెంబరులో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. 48 శాతం మంది మహిళా సర్పంచులే కావడం విశేషం. మహిళా సర్పంచులు 234 మంది ఉండటం గమనార్హం. కొత్త సర్పంచులు మద్యం, ప్లాస్టిక్ నిషేధం, ఇతర అంశాలపై దృష్టిసారించి స్ఫూర్తి చాటారు. అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో స్ఫూర్తిని అందిపుచ్చుకోవాల్సి ఉంది.

శతశాతం పన్ను వసూలుచేసిన గ్రామాలు: 430 (గత ఆర్థిక సంవత్సరంలో..)	జాతీయ స్థాయిలో మెరిసినవి: 2
వివిధ అంశాల్లో ఆదర్శంగా నిలిచినవి: 82	

అభివృద్ధిలో పథంలో ఎదుల్లాపూర్

శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్ అభివృద్ధి దిశగా దూసుకెళ్తోంది. ప్రస్తుత సర్పంచి కల్లూరి హన్మంతరావు ఆధ్వర్యంలో సౌకర్యాల కల్పనకు కృషి జరుగుతోంది. భూగర్భ మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మించారు. 18 సీసీ కెమెరాలు బిగించారు. ఉచితంగా శుద్ధినీటిని సరఫరా చేస్తున్నారు. మూడున్నర ఎకరాలలో పల్లె ప్రకృతివనాన్ని తీర్చిదిద్దారు. వైకుంఠదామం, డంపింగ్ యార్డు తదితర వసతులు కల్పించారు.

ముక్కు మూసుకోవాల్సిందే.. భయపడాల్సిందే!

నర్సాపూర్ బస్టాండ్‌లో ఇలా..

మెదక్ ప్రధాన బస్టాండ్‌లో..

మెదక్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని శౌచాలయాలకు వెళ్తే ముక్కు మూసుకోవాల్సిందే. ఊపిరి బిగపట్టి వెళ్లాల్సిన దుస్థితి. మహిళలు, పురుషులకు సంబంధించిన శౌచాలయాలు వేర్వేరుగా ఉండగా, నిర్వహణాలోపంతో అధ్వానంగా మారాయి. దుర్వాసనతో అటు వైపు వెళ్లాలంటే సాహసించాల్సిందే. ఇక నర్సాపూర్‌లో ఏళ్ల క్రితం నిర్మించిన శౌచాలయాలు శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడి పడుతున్నాయి. అక్కడక్కడ పగుళ్లు ఏర్పడ్డాయి. స్లాబు పెచ్చులూడుతుండటంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిందే.

న్యూస్‌టుడే, మెదక్ టౌన్, నర్సాపూర్

అధికారుల సమన్వయమే కీలకం

అధికారులతో సమావేశమైన ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్, మెదక్ కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఆర్ భూసేకరణ ప్రక్రియలో జిల్లా అధికారుల సమన్వయం కీలకమని ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్ పేర్కొన్నారు. శనివారం మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతిమాసింగ్, జాతీయ రహదారులు, రెవెన్యూ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియలో జిల్లా ముందంజలో ఉందన్నారు. భూములు ఇచ్చిన వారి వివరాలు పక్కాగా నమోదు చేయడం, పరిహారం అందించడం తదితర అంశాలపై చర్చించారు. అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, భూసేకరణ కన్సల్టెంట్ సుందర్ అద్నాన్, హైవే పీడీ మాధవి, మేనేజర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంచడమే లక్ష్యం

• కలెక్టర్ ప్రతిమాసింగ్

విజేతలకు పతకాలను అందిస్తున్న ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఎస్పీ ప్రసన్నకుమార్ తదితరులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని, క్రమశిక్షణను పెంచడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. శనివారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మెదక్‌లో 5 కి.మీ. పరుగు పోటీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ధ్యాన్‌చంద్ చౌరస్తా వద్ద జరిగిన సమావేశంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, డీఎస్పీ ప్రసన్నకుమార్ జ్యోతి వెలిగించి, ధ్యాన్‌చంద్ చిత్రానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రత్యేకంగా మహిళలకు 2 కి.మీ. పరుగు పోటీ చేపట్టారు. కొత్త బస్టాండ్ నుంచి ధ్యాన్‌చంద్ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం విజేతలకు పతకాలు అందజేశారు. డీపీఆర్వో రామచంద్రరాజు, మెదక్ సీఐ మహేష్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు, సీనియర్ పీఈటీ ఆనందం, పీడీలు మధుసూదన్, శ్రీనివాసరావు, మెదక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివశంకర్, అధ్యక్షుడు జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

5.32 కోట్లు @చేప పిల్లల పంపిణీ

• జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

చెరువులో చేప పిల్లలను వదులుతూ..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను చేపలపిల్లల పంపిణీకి జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. శతశాతం రాయితీపై మత్స్యకారుల జీవనోపాధికి ఈ పథకాన్ని అమలు చేస్తోన్న విషయం విదితమే. జిల్లాలోని చెరువులు, కుంటలు, శాశ్వత నీటి వనరుల్లో 5,32,16,186 చేప పిల్లలను విడుదల చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకు సంబంధించి నాణ్యత, రకాలు తదితర వాటిపై మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది.

1728 నీటి వనరుల్లో..

జిల్లాలో మొత్తం మహిళా, పురుషుల సంఘాలు 311 వరకు ఉన్నాయి. వీటిల్లో 17,631 మంది సభ్యులు చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. నిర్దేశించిన లక్ష్యంలో 35-40 పరిమాణం ఉన్న 3,99,73,326 పిల్లలను చిన్న చెరువులు, కుంటల్లో, 80-100 పరిమాణం ఉన్నవి - 1,32,42,860 పిల్లలను ఏడాది పొడవునా నీరుండే వాటిల్లో వదలనున్నారు.

అధికారుల పర్యవేక్షణ..

చేప పిల్లల పంపిణీలో పారదర్శకత కోసం వాటిని వదిలే సమయంలో జిల్లా మత్స్యశాఖ అధికారి, ఎంపీడీవో, ఏవో, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. అదే 6 నుంచి 8 నెలలు నీరుండే వాటిల్లో వదిలే సమయంలో జిల్లా మత్స్యశాఖ అధికారి, గ్రామ కార్యదర్శి, ఏఈవో, జిల్లా, గ్రామ మత్స్య సంఘం సభ్యులు ఉండాలని సూచించింది. నిర్దేశించిన మేర పరిమాణం, నాణ్యత తదితర వాటిని పరిశీలించాకే వదులుతారు.

టెండర్ ప్రక్రియ..:

ప్రస్తుతం టెండర్ ప్రక్రియ సాగుతోంది. ముగ్గురు టెండరు వేశారు. వారి చేపల చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఆర్థిక శాఖ అనుమతి లభించగానే గుత్తేదారును ఎంపిక చేస్తాం. ఈ ప్రక్రియ పూర్తవగానే చేప పిల్లలను వదిలేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

పూర్ణిమ, జిల్లా మత్స్యశాఖ అధికారిణి

కళాశాల సరే.. పక్కా భవనమేదీ?

• జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోనే నిర్వహణ

న్యూస్‌టుడే, నార్సింగి (చేగుంట)

పునాది స్థాయిలో నిలిచిన నిర్మాణం

ఏటా ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ప్రభుత్వ కళాశాల అది.. అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు ఉన్నా.. విద్యార్థులు చదువుకునేందుకు పక్కా భవనం మాత్రం కరవైంది.. కనీసం శౌచాలయాలు కూడా లేవు.. ఇది నార్సింగి కళాశాల పరిస్థితి. 2012లో ఈ ప్రాంతానికి అప్పటి ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. అప్పట్లో చేగుంటలో కలిసి ఉండేది. అప్పటి దుబ్బాక ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డి ప్రత్యేక చొరవ చూపి నార్సింగికి కళాశాలను మంజూరు చేయించారు. ఆ తర్వాత ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పడింది.

జడ్పీ ఉన్నత పాఠశాలే దిక్కు..

జూనియర్ కళాశాలలో ప్రస్తుతం 210 మంది వరకు చదువుకుంటున్నారు. నార్సింగితో పాటు నర్సంపల్లి, సంకాపూర్, శేరిపల్లి, సంకాపూర్ తండా, జప్తిశివనూర్, కాస్లాపూర్, పెద్దతండా, చేగుంట మండలం వల్లభాపూర్, చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 14 ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు పక్కా భవనం లేదు. ప్రస్తుతం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అదనపు గదుల్లో తరగతులు కొనసాగిస్తున్నారు. శౌచాలయాలు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థినులు సమీపంలోని స్నేహితుల ఇళ్లకు వెళ్తున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు దూరం వెళ్లాల్సి వస్తోంది. మహిళా అధ్యాపకుల పరిస్థితి దయనీయంగా ఉంది.

పునాది స్థాయిలోనే..

భవన నిర్మాణానికి 2013లో అప్పటి ఎమ్మెల్యే ముత్యంరెడ్డి శ్రీకారం చుట్టారు. నిధుల్లేక పునాది స్థాయిలోనే ఆగిపోయింది. భవనం పూర్తయితే విద్యార్థులకు ప్రయోజనం. వసతులు లేక కేవలం బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపులు మాత్రమే కొనసాగుతున్నాయి. పాఠశాలకు చెందిన ఆరు గదులు సరిపోవడం లేదు. సైన్స్ ల్యాబ్‌కు మరోటి కేటాయించినా పుస్తకాలు, ఇతర సామగ్రి భద్రపరిచారు. నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రతిపాదించగా, కాగితాలకే పరిమితమైంది. ఇకనైనా అధికారులు, పాలకులు చొరవ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిల్లల హక్కుల సంరక్షణ అందరి బాధ్యత

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: పిల్లల సంక్షేమం, భద్రత, వారి హక్కుల సంరక్షణ అందరి బాధ్యతని ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ ఆర్.ఎం. సుభవల్లి సూచించారు. శనివారం హవేలిఘనపూర్ డైట్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నల్సా పథకం-2024 (బాలల స్నేహపూర్వక న్యాయ సేవలు) చట్టంపై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు వారి హక్కుల గురించి తెలియజేయాలన్నారు. వారితో సున్నితంగా వ్యవహరించాలన్నారు. అంతకుముందు జిల్లా వైద్యాధికారి గణేశ్వర్ మాట్లాడుతూ.. పిల్లలు మత్తు పదార్థాల బారిన పడకుండా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి ప్రభాకర్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, డీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ సుభవల్లి

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి మున్సిపాలిటీ: సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, పుట్టగొడుగుల పెంపకంపై ఉచిత శిక్షణ కోసం అభ్యర్థులు బైపాస్ రహదారిలోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ రాజేశ్ కుమార్ తెలిపారు. తెల్లరేషన్ కార్డున్న సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన 19 నుంచి 45 ఏళ్లలోపు గ్రామీణ ప్రాంత పురుషులు అర్హులన్నారు.

WANTED

HYDERABADలో ప్రసిద్ధిగాంచిన ఒక ప్రముఖ కార్పొరేట్ ABHYAAS Jr. COLLEGE హైదరాబాద్ బ్రాంచి నందు ADMISSIONS చేయుట కొరకు మెదక్, నరసాపూర్, జహీరాబాద్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, తూప్రాన్, రామాయంపేట్, సంగారెడ్డి, అందోల్, నారాయణఖేడ్, ఏరియాలలో పనిచేయుటకు (PROలు) 2 వీలర్ ఉండి + కార్పొరేట్ కాలేజీలో (PRO) లుగా చేస్తున్న అనుభవజ్ఞులు కావలెను మంచి జీతం + ఇతర అలవెన్సులు ఇవ్వబడును

9110596427

NOBLE COLLEGE OF EDUCATION (B.Ed)

Toopran (V & M), Medak Dist. 502334
Contact No. 9440965990, email:noblecoe@gmail.com
website: www.nobleedu.com
Cell Nos. 90008 07086, 97059 30144

CATEGORY "B" ADMISSION INTO B.Ed.

Applications are invited from TS Ed-CET-2026 qualified candidates for admission into two years B.Ed. Course for the Academic year 2026-27, batch under CATEGORY "B" Management Seats (12). The Candidates should submit the filled applications along with all necessary Original certificates and application fee Rs. 500/- in the college on or before **31.08.2026.**

NOTE: Candidates should Secure 50% of B.Tech/B.E and B.A/ B.Com/B.Sc with 50% for OC, 40% for BC, SC & ST.

Sd/- **PRINCIPAL**

నిధులున్నా ఎందుకు పూర్తిచేయరు

పాదయాత్రలో పద్మాదేవేందర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి తదితరులు

నిజాంపేట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధికి రూ.13 కోట్లు మంజూరైనా, ప్రస్తుత ప్రభుత్వం పనులు చేయకుండా వదిలేసిందని తెరాస జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. శనివారం నిజాంపేట మండలం నందగోకుల్ నుంచి చల్మెడ కమాన్ వరకు నిలిచిపోయిన రోడ్డు, వంతెన పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని పనులు నిలిపివేసిందని ఆరోపించారు. రోడ్డును పూర్తిచేయకపోతే నిరాహార దీక్ష చేపడతామని, ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని స్పష్టంచేశారు. శశిధర్‌రెడ్డి, భట్టి జగపతి, సుధాకర్‌రెడ్డి, లావణ్యరెడ్డి పాల్గొన్నారు.

పరీక్షించి..

వైకల్య శాతాన్ని గుర్తించి..

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం మెదక్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో శనివారం దివ్యాంగులకు యూనిక్ డిజెబిలిటీ ఐడీ కార్డుల జారీ నిమిత్తం వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 175 స్లాట్లు కేటాయించగా, 147 మంది తరలివచ్చారు. వారందరికీ వివిధ పరీక్షలు చేపట్టి వైకల్య శాతాన్ని గుర్తించారు. ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ సునీత, ఆసుపత్రుల సమన్వయకర్త శివదయాల్ ప్రక్రియను పర్యవేక్షించారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా..?

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

హైవోల్టేజీ తీగల కింద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జిల్లా కేంద్రం మెదక్‌లో ఏ కార్యక్రమం నిర్వహించినా ప్రధాన రహదారులు, చౌరస్తాలు, విభాగినులు ఫ్లెక్సీలతో నిండిపోతున్నాయి. తమ అభిమానాన్ని చాటుకునేందుకు ఇష్టానుసారంగా ఏర్పాటుచేస్తుండటంతో ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. దీనికితోడు వాటిని అలాగే వదిలేస్తున్నారు. దీంతో అవి గాలి వీస్తున్నప్పుడల్లా ఊగుతున్నాయి. కొన్ని చోట్ల నేలకూలడంతో ప్రాణసంకటంగా మారుతున్నాయి. మరోవైపు ప్రధాన కూడళ్లు, చౌరస్తాల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని దుస్థితి.

అనుమతి తీసుకోకుండానే..

పట్టణాల్లో ఫ్లెక్సీల ఏర్పాటుకు పురపాలిక చట్టం ప్రకారం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందే. వారం రోజుల ముందే ఏర్పాటుకు సంబంధించి డబ్బును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. ఆ తర్వాత పరిశీలించి అధికారులు అనుమతిస్తారు. కార్యక్రమం ముగిశాక వాటిని తొలగించాలి. అనుమతి లేకుండానే ఏర్పాటుచేయడంతో పాటు వాటిని అలాగే వదిలేస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది సైతం తమకెందుకులే అన్నట్లు ఊరుకుంటున్నారు. తద్వారా పురపాలిక ఆదాయానికి గండి పడుతోంది.

ఇద్దరు బలైనా..

గతంలో ఓ సారి 765 డీ రహదారిపై ఫ్లెక్సీలను విద్యుత్తు స్తంభాలకు ఆనుకొని ఏర్పాటుచేశారు. దీన్ని గమనించని ఇద్దరు యువకులు వాటిని పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. అదే దరఖాస్తు చేసి ఉంటే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనువైన ప్రాంతాన్ని గుర్తించి సూచిస్తారు. అయినా ఎవరూ దీన్ని పట్టించుకోవడం లేదు. ఇప్పటికీ పట్టణంలో చాలా కూడళ్లలో ఫ్లెక్సీలు ఉన్నాయి. ఈదురుగాలులకు పలు చోట్ల పడిపోగా, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్తు ప్రమాదాలు సంభవించే అవకాశం లేకపోలేదు. ఇకనైనా అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు. ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...

జి.ఎస్.టి. 5% అదనం పూర్తి వివరాలకు:

9000014771

(c) eenadu

చిన్న యూనిట్లు.. ప్రగతికి మెట్లు

న్యూస్‌టుడే, జిన్నారం: భారీ, మధ్యతరహా పరిశ్రమలతోపాటు చిన్న యూనిట్లు ఆర్థికాభివృద్ధిలో కీలకమవుతున్నాయి. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. పెద్ద పరిశ్రమలకు కావాల్సిన జాబ్‌వర్క్‌ను అందిస్తున్నాయి. ఒక రకంగా మినీ పరిశ్రమలు లేకుంటే పెద్దవాటి మనుగడకే ప్రమాదం. ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. అంత ఆర్థిక స్తోమత లేక అవి మూతపడే అవకాశాలుంటాయి. చాలా మంది ఉపాధి లేక బిక్కుబిక్కుమనే దుస్థితి దాపురిస్తుంది. అందుకే చిన్నతరహా యూనిట్లకు ప్రత్యేక స్థానం ఉంటుంది. **ఆదివారం చిన్నతరహా పరిశ్రమల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..**

ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓ చిన్నతరహా రసాయన పరిశ్రమ

యువతకు మంచి అవకాశాలు...

యువతకు చిన్న యూనిట్ల ఏర్పాటుతో ఇటు ఉపాధితోపాటు ఇతరులకు పని కల్పించే అవకాశం కలుగుతుంది. బయట అనుభవం గడించి మార్కెట్లో డిమాండ్, భవిష్యత్తు ఉన్న యూనిట్లను నెలకొల్పితే బాగుంటుంది. ఇదే సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రుణాలు సద్వినియోగం చేసుకోవాలి. - సునీల్, అధ్యక్షుడు, చిన్నతరహా పరిశ్రమల సంఘం

అనేక రకాల ఉత్పత్తులు..

చిన్న పరిశ్రమలతో అనేక రకాల ఉత్పత్తులు తయారవుతున్నాయి. రైస్‌మిల్లులు, ఆగ్రో, ఇనుప గ్రైండింగ్, ఫాబ్రికేషన్, ఫార్మా, బల్క్‌డ్రగ్స్, ప్లాస్టిక్, కాగితం, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, గ్రానైట్ కట్టింగ్ వంటివి ఉన్నాయి. పటాన్‌చెరు ప్రాంతంలో ఎక్కువగా ఇంజినీరింగ్, రసాయన పరిశ్రమలు ఉండడంతో వాటికి అనుబంధంగా ఉత్పత్తులు తయారు చేసే యూనిట్లు నెలకొల్పారు. రాష్ట్రంలోనే ఎక్కువగా చిన్న పరిశ్రమలున్న ప్రాంతం పటాన్‌చెరు. బీహెచ్‌ఈఎల్ వంటి భారీ పరిశ్రమకు అనుబంధంగా అశోక్‌నగర్ ప్రాంతంలోనే 2వేల వరకు చిన్నతరహా పరిశ్రమలున్నాయి. బాలానగర్, సనత్‌నగర్ ప్రాంతాల్లోని చిన్న పరిశ్రమలు జిన్నారం మండలం గడ్డపోతారం పురపాలిక పరిధిలోని వావిలాలకు తరలి వస్తున్నాయి. ఇప్పటికే 60 ఎకరాల స్థలం కేటాయించగా.. 112 పరిశ్రమలను ఏర్పాటు చేసే చర్యలు మొదలయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని వివిధ పారిశ్రామిక వాడలతోపాటు మెదక్ జిల్లా తూప్రాన్, మనోహరాబాద్ ప్రాంతాల్లో చిన్న యూనిట్లు ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో వ్యవసాయ ఆధారిత యూనిట్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలతోపాటు ప్రధానమంత్రి ముద్ర యోజన, పీఎం ఈజీపీ, సీజీటీఎంఎస్ఈ వంటి రుణాలను సైతం అందిస్తున్నాయి. ఆహార ఉత్పత్తులతోపాటు వస్త్రాలు, చేతి వృత్తులు, గృహోపకరణాలు, కాగితం వస్తువులు, సేవారంగ ఉత్పత్తులు సైతం చిన్న పరిశ్రమల కిందనే పరిగణిస్తారు.

జిల్లా	చిన్న పరిశ్రమలు
సంగారెడ్డి	5162
మెదక్	2252
సిద్దిపేట	640

- ఉమ్మడి మెదక్ జిల్లాలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు: **33026**
- ఉపాధి పొందుతున్న వారు: **1.25 లక్షలు**

కాసులిచ్చినా.. భూములు దక్కలే!

• 16.28 ఎకరాల కేటాయింపులో రెవెన్యూ అధికారుల జాప్యం

ఆర్టీసీకి గతంలో ఇచ్చిన భూములివే..

ఈనాడు, వికారాబాద్: రహదారులు తరచూ నెత్తిటితో తడుస్తున్నాయి. రోడ్లపై ప్రయాణాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో డ్రైవర్లను అప్రమత్తం చేయడంలో భాగంగా వారికి నిరంతర శిక్షణ ఇవ్వడానికి ఆర్టీసీ అధికారులు ప్రయత్నించారు. రాజధానికి శివారులో ఒక శిక్షణ సంస్థ ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. 2010లో స్థానికంగా 29.4 ఎకరాల సర్కారు భూముల కేటాయింపుల్లో భాగంగా రెవెన్యూ శాఖకు డబ్బులు చెల్లించారు. 26 ఏళ్లయినా సంస్థకు భూములు దక్కలేదు.

ఇదీ పరిస్థితి..

వికారాబాద్ రెవెన్యూ పరిధిలోని కామారెడ్డిగూడెంలో 16.28 ఎకరాల అసైన్డ్‌తోపాటు సర్కారు స్థలాలున్నట్లు గుర్తించారు. పట్టణంలోని బస్ డిపోనకు సమీపంలో, రాజధానికి కేవలం 60 కి.మీ. దూరంలో ఉండడంతో అక్కడ శిక్షణ సంస్థ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ తలపెట్టింది. కొత్తగా బస్సులతోపాటు భారీ వాహనాలు నడిపేవారికి శిక్షణ, ఆ రంగంలో సేవలు అందించేవారికి నిరంతర మెలకువలు నేర్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెవెన్యూ అధికారులతో కలిసి ఆర్టీసీ వారు పలు దఫాలుగా చర్చల అనంతరం సర్వే పనులు పూర్తి చేశారు. అందులో భాగంగా 2010 డిసెంబరులో 29.4 ఎకరాలను ఆర్టీసీకి ఇవ్వడానికి అంగీకారం కుదిరింది. తొలి దశలో రూ.31.20 లక్షలు చెల్లించగా.. అప్పటి రెవెన్యూ అధికారులు 13.12 ఎకరాలు ఆర్టీసీకి అప్పగించారు. దీంతో అధికారులు వెంటనే అక్కడ భారీ గోడ నిర్మించారు. నేలను చదువు చేశారు. మిగిలిన భూములిస్తే పనులు ప్రారంభించాలనుకున్నారు. ఆ తర్వాత కథ మొదటికొచ్చింది.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం..

ఆర్టీసీకి భూ కేటాయింపునకు సంబంధించిన దస్త్రం పెండింగ్‌లో ఉన్న విషయం నిజమే. ఇటీవల పలు పనుల కారణంగా పరిష్కారం కాలేదు. వారు పరిహారం చెల్లింపుల విషయంలో ఆలస్యం చేశారు. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పిస్తాం. - లక్ష్మీనారాయణ, వికారాబాద్ రెవెన్యూ అధికారి

14 ఏళ్ల తరువాత..

ఆర్టీసీ అధికారులు 2010 తరవాత పలు దఫాలుగా సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూముల్లోని 8 మంది రైతులతో మాట్లాడుతున్నామని.. గతంలో ఇచ్చిన పరిహారం ఇప్పుడు ఇస్తే కుదరదని తెలిపారు. మిగిలిన భూములు ఇవ్వాలంటే పరిహారం కింద రూ.1.2 కోట్లు కావాలన్నారు. చెల్లింపులయ్యాక భూములు అప్పగిస్తామన్నారు. దీంతో చేసేది లేక ఆర్టీసీ 2024 నవంబరు 11న మొత్తాన్ని రెవెన్యూశాఖ ఖాతాలో జమ చేసింది. ఆ దస్త్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో కొందరు అధికారులు తొక్కిపెట్టారు. పరిహారం సరిపోవడం లేదని, మోకాలో ఉన్న రైతులు అంగీకరించడం లేదంటున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే రెవెన్యూ సిబ్బంది కావాలని దస్త్రాన్ని పక్కన పడేసి రకరకాల కారణాలు చెబుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సహజసిద్ధ ఆహారం ప్రదర్శన

సిద్దిపేట పట్టణంలోని ఓ ప్రైవేటు బడిలో విద్యార్థులు ఉడకబెట్టని, నిప్పు అంటని ఆహార పదార్థాలను 50 రకాలు తయారుచేసి శనివారం ప్రదర్శించారు. కూరగాయలను వివిధ ఆకారాల్లో తీర్చిదిద్దారు. ముఖ్య అతిథిగా తెలంగాణ బడ్జెట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి పాల్గొని ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. - న్యూస్‌టుడే, సిద్దిపేట

'రెడ్డి కార్పొరేషన్' వెంటనే ఏర్పాటు చేయాలి

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న రెడ్డి ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు రాంరెడ్డి డిమాండ్ చేశారు. రెడ్డి సామాజికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబరు 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరసన దీక్ష గోడపత్రికలను సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెడ్డి సామాజిక వర్గాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావొస్తున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. గత భారాస ప్రభుత్వం రెడ్డి సామాజిక వర్గానికి హైదరాబాద్‌లో రెండు ఎకరాల భూమి కేటాయించిందని, దానిని కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. సమావేశంలో నేతలు మల్లికార్జున్‌రెడ్డి, రామలింగారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, దుర్గారెడ్డి, ఉమ, పద్మ ఉన్నారు.

రేపటి నుంచి పీజీ కళాశాలలో తక్షణ ప్రవేశాలు

సిద్దిపేట: ఈనెల 31 నుంచి సెప్టెంబరు 3 వరకు సిద్దిపేటలోని ఓయూ పీజీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డా.ఛత్రపతి యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యాసంవత్సరానికి ఖాళీ సీట్ల భర్తీలో భాగంగా ప్రక్రియ చేపట్టామని, సంబంధిత సమాచారం టీజీ ఐసెట్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు చెప్పారు. కళాశాల నోటీసు బోర్డులో వివరాలు ప్రదర్శించామని, అర్హులైన అభ్యర్థులు ఆసక్తి మేర విద్యార్హత, ఇతరత్రా ధ్రువపత్రాలు, టీజీ ఐసెట్‌లో అర్హత సాధిస్తే ర్యాంకు కార్డుతో సహా హాజరు కావాలన్నారు.

'మల్లన్న' సత్రం నిర్మాణానికి రూ.15 లక్షల విరాళం

ఆలయ సిబ్బందికి చెక్కు అందజేస్తున్న దాత మల్లికార్జున్‌గౌడ్

చేర్యాల, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన 100 గదుల సత్రం కోసం హైదరాబాద్‌లోని కొత్తపేట సౌభాగ్యనగర్ కాలనీకి చెందిన మల్లికార్జున్‌గౌడ్ రూ.15 లక్షలు విరాళంగా అందజేశారు. కుటుంబ సభ్యులతో శనివారం ఆలయానికి వచ్చిన ఆయన స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్‌కు చెక్కు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు నీల చంద్రశేఖర్, ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏల అప్రమత్తతతోనే అర్హులందరికీ ఓటుహక్కు

మాట్లాడుతున్న ఆంటోనిరెడ్డి

గజ్వేల్, న్యూస్‌టుడే: అర్హులందరికీ ఓటుహక్కు దక్కేలా బీఎల్‌ఏలు అప్రమత్తంగా వ్యవహరించాలని భాజపా మెదక్ ఉమ్మడి జిల్లా సర్ ఇన్‌ఛార్జిలు ఆంటోనిరెడ్డి, సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం గజ్వేల్‌లోని ప్రజ్ఞాగార్డెన్‌లో 'సర్'పై నిర్వహించిన భాజపా బీఎల్‌ఏల వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. సర్-1, సర్-2లో బీఎల్‌ఏల పాత్ర కీలకమని, పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఎవరికీ అన్యాయం జరకుండా చూడాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్‌రావు, గజ్వేల్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సింగం సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సురేష్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శివకుమార్, కౌన్సిలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకో టీ.. అనగలరా

న్యూస్‌టుడే, హుస్నాబాద్: చక్కెర ధర నాణ్యతనుబట్టి కిలో రూ.65 నుంచి రూ.80 వరకు చేరడంతో హోటళ్లలో చాయ్ ధర పెంచారు. రూ.10 ఉన్న ధరను రూ.15 చేశారు. కాఫీ, గ్రీన్, లెమన్ టీల ధరలను సైతం పెంచి బోర్డులు పెట్టారు. అల్లం ధర సైతం పెరగడంతో టీ ధర పెంచారు. చక్కెర ధర తగ్గితే రేట్ తగ్గిస్తారా అనేది చాయ్ ప్రియుల ప్రశ్న.

హుస్నాబాద్‌లోని చాయ్ హోటల్‌లో ధరల పట్టిక

శ్రావణ మాసం.. సంతోషకరమైన పెళ్లిళ్లకు శ్రీకారం

- అవివాహితులైన అన్ని కులాల కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సువర్ణావకాశం
- నేడు అవివాహితులైన అన్ని కులాల కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 'ఈనాడు' పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదికైన 'ఈనాడు' పెళ్లి పందిరి, అవివాహితులైన అన్ని కులాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, వారి కుటుంబీకులు నేడు (30 ఆగస్టు 2026 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. వివరాలకు **9154340820 & 9154992572** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్, యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలిచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన సూచించిన వాట్సాప్ నంబర్లకు పంపవచ్చు.

నోట్: ఈ శ్రావణంలో ప్రతి ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ నమోదుతో..

• ఒక నెల ప్రొఫైల్ హైలైటర్ (మీ ప్రొఫైల్‌ను ఎక్కువ మంది చూసుకునే అవకాశం) • అపరిమిత ఎక్స్‌ప్రెస్ ఇంట్రెస్టులు (మీకు నచ్చిన సంబంధాలకు ఆసక్తి తెలియజేసే అవకాశం)

విదేశీ విద్యానిధి.. బీసీ విద్యార్థులకు పెన్నిధి

న్యూస్‌టుడే, సిద్దిపేట గ్రామీణ: విదేశాల్లో ఉన్నత చదువుల కల సాకారం చేసుకునే వెనుకబడిన తరగతుల (బీసీ, ఈబీసీ) విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మహాత్మా జ్యోతిబా పులే బీసీ విదేశీ విద్యానిధి పథకం కింద సెప్టెంబరు 1 నుంచి 30వ వరకు అంతర్జాలంలో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

లభించే ఆర్థిక సాయం..

- విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి ఎంపికైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజు, ఇతర ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నిర్దేశించిన మొత్తం (రూ.20 లక్షల వరకు) ఉపకార వేతనంగా అందజేస్తారు.
- ఈ సీజన్‌లో మొత్తం 350 మందికి అవకాశం కల్పిస్తుండగా అందులో 250 మంది బీసీ విద్యార్థులకు, 100 మంది ఈబీసీ విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది.

కావాల్సిన పత్రాలు

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పుట్టిన తేదీని ధ్రువీకరించే పత్రం (టెన్త్ మార్కుల మెమో లేదా బర్త్ సర్టిఫికేట్), ఆధార్ కార్డు, విదేశీ యూనివర్సిటీ నుంచి పొందిన ప్రవేశ పత్రం, డిగ్రీ లేదా ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికేట్లు, మెమోలు. విదేశీ ప్రయాణానికి అవసరమైన పాస్‌పోర్ట్, బ్యాంక్ పాస్ బుక్ వివరాలు, రీసెర్చ్ ప్రపోజల్ (పీహెచ్‌డీ విద్యార్థులకు మాత్రమే), పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు ఉండాలి.

ఎవరెవరు అర్హులంటే..

కులం, ఆదాయం: విద్యార్థులు బీసీ లేదా ఈబీసీ వర్గానికి చెందిన వారై ఉండాలి. గ్రామీణ ప్రాంతాల వారికైతే కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల్లోపు ఉండాలి.

విద్యార్హతలు: మాస్టర్స్ డిగ్రీ(పీజీ) లేదా పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, మేనేజ్‌మెంట్ తదితర డిగ్రీ కోర్సుల్లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

వయోపరిమితి: పీజీ కోర్సులకు దరఖాస్తు చేసే నాటికి 35 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలి. ఒక కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.

మీకు తెలుసా?

దరఖాస్తు విధానం

అర్హులైన అభ్యర్థులు తెలంగాణ ప్రభుత్వ అధికారిక ఈ-పాస్ వెబ్‌సైట్‌ను సందర్శించి హోమ్ పేజీలో ఉండే మహాత్మా జ్యోతిబా పులే బీసీ విదేశీ విద్యానిధి లింక్‌ను క్లిక్ చేయాలి. అక్కడ సూచించిన విధంగా వ్యక్తిగత వివరాలను నమోదు చేయాలి. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అప్లోడ్ చేసి అంతర్జాల దరఖాస్తును సమర్పించాలని సిద్దిపేట జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సహిద్ రఫీక్ తెలిపారు.

జాతీయస్థాయి కబడ్డీ న్యాయనిర్ణేతగా నరేంద్రబాబు

ములుగు, న్యూస్‌టుడే: జాతీయస్థాయి కబడ్డీ (రెఫరీ)న్యాయనిర్ణేతగా సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం దామరకుంటకు చెందిన అంగడి నరేంద్రబాబు ఎంపికయ్యాడు. ఆమేచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏకేఎఫ్ఐ), తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఎంపిక పరీక్షలు జూన్‌లో హైదరాబాద్‌లోని బాచుపల్లిలో జరిగాయి. నిర్వాహకులు శనివారం వెల్లడించిన పరీక్ష ఫలితాల్లో దామరకుంటకు చెందిన అంగడి నరేంద్రబాబు ఎంపికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్, కోశాధికారి సత్యంతో పాటు సభ్యులు రాజు, మహేశ్, కరుణాకర్ నరేంద్రబాబును అభినందించారు. న్యాయనిర్ణేతగా ఆయన ఉత్తమ సేవలు అందించాలని పలువురు అంటున్నారు. ఈ ఎంపిక సిద్దిపేట జిల్లాకు ఎంతో గర్వకారణమన్నారు.

పోతారెడ్డిపేట గ్రామాభివృద్ధికి కృషి: ఎంపీ

మాట్లాడుతున్న రఘునందన్‌రావు

దుబ్బాక: పోతారెడ్డిపేటలోని సమస్యలను పరిష్కరించి, అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేటలో పర్యటించారు. గ్రామ శివారులోని శ్రీకేదారేశ్వర ఆశ్రమ ప్రహరీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మురుగు కాల్వల నిర్మాణంతోపాటు జాతీయ రహదారికి ఇరువైపులా త్వరలోనే బస్టాండ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఇటీవల మృతిచెందిన భాజపా కార్యకర్త నరేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీకేదారేశ్వర ఆశ్రమ నిర్వాహకులు రాములు మహరాజ్, సర్పంచులు మౌనిక, భానుప్రసాద్, నాయకులు అంబటి బాలేశ్‌గౌడ్ ఉన్నారు.

బాలసాహిత్య పురస్కారానికి ఎంపిక

సిద్దిపేట: సిద్దిపేటకు చెందిన కవయిత్రి **ఎడ్ల లక్ష్మి**. రేగులపాటి(రంగినేని) లక్ష్మి జాతీయ బాలసాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు సిరిసిల్ల రంగినేని ట్రస్టు అధ్యక్షుడు నవీన్‌కుమార్ ధ్రువీకరించారు. సుదీర్ఘంగా బాలసాహిత్యంలో గేయాలు, కథలు రాయగా పలు పుస్తకాల్లో ప్రచురితమయ్యాయి. వచ్చే నెల 12న సిరిసిల్లలో పురస్కారం ప్రదానం చేయనున్నారు. సిద్దిపేటకు చెందిన కవులు ఉండ్రాళ్ల రాజేశం, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, బస్వరాజకుమార్, పరశురాములు, రాజయ్య, సుధాకర్ అభినందించారు.

పోలీసుల పేరుతో రూ.30 వేలు టోకరా

కంగ్టి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఓ మీసేవకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి రూ.30 వేలు దోచేసిన ఘటన సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు.. స్థానిక మీసేవ కేంద్రంలోని చరవాణికి సైబర్ నేరగాళ్లు ఇటీవల ఫోన్ చేసి పోలీసులమని చెప్పారు. ఓ పాపకు రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిపి.. చికిత్స చేయించడానికి యూపీఐ ద్వారా రూ.30 వేలు పంపిస్తే నగదు అందిస్తామని నమ్మబలికారు. మీసేవ కేంద్రం నిర్వాహకులు నమ్మి ఆన్‌లైన్‌లో రూ.30 వేలు పంపించారు. అనంతరం నగదు విషయమై ఫోన్ చేస్తే స్పందన రాలేదు. మోసపోయామని గ్రహించిన వారు శనివారం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతి చెందింది. నర్సాపూర్ ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దచింతకుంటకు చెందిన **పట్నం లావణ్య**, మోదన్ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతోపాటు పాడిపోషణతో జీవనం సాగిస్తున్నారు. శనివారం లావణ్య ఇంటి వద్ద దుస్తులను రేకుల షెడ్డులో ఇనుప పైపులకు కట్టిన తీగపై ఆరేస్తుండగా, విద్యుత్తు తీగ తగిలి కరెంట్ షాక్ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. మోహన్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

బాగున్నారా అన్నాడు.. బంగారం గుంజుకెళ్లాడు

గొలుసుల చోరీ ఘటనలో మహిళకు తీవ్ర గాయం

తాండూరు పట్టణం, న్యూస్‌టుడే: తెలిసిన వ్యక్తే కదా అని ఆ మహిళ అతన్ని ఇంట్లోకి రానిచ్చింది. బాగున్నారా అమ్మా.. అంటూ పలకరిస్తూనే.. మెడలోని బంగారాన్ని గుంజుకొని పారిపోయిన ఘటన తాండూరు పట్టణంలో కలకలం రేపింది. ఈ క్రమంలో బాధిత మహిళ మెడకు బలమైన గాయమైంది. పోలీసుల కథనం ప్రకారం.. తాండూరు పట్టణం బసవేశ్వర్ నగర్‌లో సుభాన్‌రెడ్డి, ఉమాదేవి దంపతులు నివసిస్తున్నారు. బుజ్జమ్మ అనే మహిళ వారింట్లో కొన్నిరోజులు పనిమనిషిగా చేసింది. ఆ చనువుతో శనివారం ఆమె భర్త మొగులప్ప ఉమాదేవి ఇంటికొచ్చాడు. ఆ సమయంలో ఉమాదేవి ఒక్కరే ఇంట్లో ఉన్నారు. యోగక్షేమాలు మాట్లాడుతూ.. ఆమె మెడలోని బంగారు ఆభరణాలపై కన్నేశాడు. ఉన్నట్లుండి పుస్తెలతాడు, నల్లపూసల గొలుసును లాక్కొని పరారయ్యాడు. లాక్కొనే క్రమంలో పుస్తెలతాడు గొంతుకు బలంగా కోసుకోవడంతో తీవ్ర రక్తగాయమైంది. బాధితురాలి కేకలకు చుట్టు పక్కల ఇళ్ల వారు వచ్చి క్షతగాత్రురాలిని తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఉమాదేవి నుంచి పట్టణ సీఐ పరమేశ్వర్‌గౌడ్ వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాదారుడిపై పీడీ యాక్టు

నిందితుడు మహ్మద్ రఫీక్

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: రేషన్ బియ్యం అక్రమ రవాణాదారుడిపై భవానీ నగర్ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా కొంటూరు గ్రామానికి చెందిన సీసీ టీవీ టెక్నీషియన్ మహమ్మద్ రఫీక్ కొంతకాలంగా తలాబ్ కట్ట నషమన్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని రకరకాల మార్గాల ద్వారా సేకరిస్తున్నాడు. పెద్ద మొత్తంలో నిల్వ చేసి, ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తూ లాభాలు గడిస్తున్నాడు. రఫీక్‌పై భవానీ నగర్, మీర్‌చౌక్, మెదక్ టౌన్ పోలీసు స్టేషన్లలో కేసులున్నాయి. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు భవానీ నగర్ పోలీసులు అతనిపై పీడీ యాక్ట్ నమోదు చేసి, శనివారం చంచల్‌గూడ జైలుకు తరలించారు.

అనారోగ్యంతో బాధపడుతూ యువకుడి బలవన్మరణం

మిరుదొడ్డి: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్తాపానికి గురై ఓ యువకుడు బలవన్మరణం చెందిన ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సతీశ్ వివరాలు తెలిపారు. గ్రామానికి చెందిన పున్నయ్య, లక్ష్మి దంపతుల ఏకైక కుమారుడైన **రాజిరెడ్డి** (34) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. అతడికి పెళ్లి కాలేదు. ఈ క్రమంలో గత కొంత కాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో మరొకరు..

యాలాల(రాస్నం): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన కృష్ణ మండల్.. భార్య, కుమారుడు **రోహిత్ మండల్** (19)తో కలిసి ధారూర్ రేంజ్ పరిధిలోని అడవిలో మొక్కలు నాటే పనులు చేయడానికి వచ్చారు. ఓ గుత్తేదారు వీరితోపాటు పలు కుటుంబాలను తీసుకొచ్చారు. నెల రోజులుగా కుటుంబ సభ్యుల మధ్య కలహాలు జరుగుతుండడంతో మనస్తాపంతో రోహిత్ అడవిలోని చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తోటి కూలీలు గుత్తేదారు సుఖ్‌దేవ్‌కు విషయం తెలిపారు. ఆయన అటవీశాఖ సెక్షన్ అధికారులు కనకరాజు, కాశయ్యకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షకు తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	117-00
రిటైల్	144-00
డ్రెస్డ్	223-00
స్కిన్‌లెస్	252-00

టాయిలెట్.. ఒక ప్రయోగం!

న్యూస్‌టుడే, రాయపోల్: కొందరికి ఇండియన్ టాయిలెట్ తరహా సౌకర్యంగా ఉంటుంది. మరికొందరికి పాశ్చాత్య విధానంలో ఏర్పాటు చేసింది అనుకూలమవుతుంది. మోకాళ్లు, నడుము నొప్పులు ఉన్నవారు పాశ్చాత్య టాయిలెట్‌ను వాడుతున్నారు. ఒకే బేసిన్‌లో రెండింటినీ ఏర్పాటు చేసి వినియోగించుకునేలా ఆలోచన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వచ్చింది. గైడ్ ఉపాధ్యాయుడు నాగరాజు సహకారంతో నాలుగు, ఐదో తరగతి విద్యార్థులు లిఖిత ప్రియ, శ్రావణి .. నమూనా టాయిలెట్ తయారు చేశారు. ఇండియన్, వెస్టర్న్ టాయ్‌లెట్ రీడిజైన్ పేరుతో చేశారు.

రైలులో ప్రయాణిస్తూ గమనించారు

ఒకే టాయిలెట్‌ను రెండు రకాలుగా వాడుకోవచ్చు. రైల్వే, ఇతర కార్యాలయాల్లో ప్రాజెక్టును చూపించి వాటి ప్రాముఖ్యాన్ని వివరించి అమలయ్యేలా చూస్తామని గైడ్ తెలిపారు. ఇందుకోసం దక్షిణమధ్య రైల్వే అధికారులతో మాట్లాడామని వారి ముందు డ్యూయల్ టాయిలెట్‌ను ప్రదర్శిస్తామని తెలిపారు. రైలులో ప్రయాణిస్తున్న సమయంలో వేర్వేరుగా టాయిలెట్లు ఉండటాన్ని విద్యార్థులు గమనించి ఈ ఆలోచన చేశారు. విమానాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర కార్యాలయాలు, పబ్లిక్ ప్రదేశాలు, ఇళ్లలో రెండు రకాలవి ఏర్పాట్లు చేయాల్సి రావడంతో స్థలం, డబ్బు వృథా అవుతున్నట్లు గుర్తించారు. సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకూ దీనిని పంపిస్తామన్నారు.

స్థలం, ఖర్చు ఆదా చేయడమే ఉద్దేశం

రాయపోల్ మండలం కొత్తపల్లి పాఠశాలలో విద్యార్థులతో గైడ్ ఉపాధ్యాయుడు

తెలుగు కవుల వేషధారణలతో ఆకట్టుకున్న విద్యార్థులు

చేర్యాల: మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని చేర్యాల మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు భాషావైశిష్ట్యాన్ని ప్రదర్శించారు. అర్జున్‌పట్ల జడ్పీ ఉన్నత పాఠశాల చిన్నారులు పలువురు కవుల వేషధారణలతో అలరించారు.

(c) eenadu

గోదాంల నిర్మాణానికి చర్యలు తీసుకోండి

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: జిల్లాలోని పీఏసీఎస్‌లలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యంతో గోదాంల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గోదాంల నిర్మాణం, భూముల కేటాయింపులపై దృష్టిసారించాలన్నారు. వెల్దుర్తి, రంగంపేట పీఏసీఎస్‌లలో నిర్మాణం చేపట్టే ప్రతిపాదనలు పరిశీలించారు. జిల్లా సహకార అధికారి పద్మ, అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, డీఏవో దేవ్‌కుమార్, అదనపు డీఆర్డీవో సరస్వతి, సీఈవో ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ముందుకొచ్చి.. బిల్లులు చెల్లించి..

రైతుల జాబితాను అందజేస్తున్న సర్పంచి షాలీబాయి

కౌడిపల్లి, న్యూస్‌టుడే: కౌడిపల్లి మండలం హరిచంద్ తండా సర్పంచి లకావత్ షాలీబాయి పెద్ద మనసు చాటుకున్నారు. స్థానిక రైతుల వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి రూ. 20 వేల బిల్లులను విద్యుత్తు శాఖకు చెల్లించారు. 70 మంది సర్వీస్ బిల్లులు బకాయి ఉండగా, విషయం తెలుసుకున్న సర్పంచి సొంతంగా చెల్లించేందుకు ముందుకొచ్చారు. శనివారం లైన్‌మెన్ మాణిక్యాన్ని పంచాయతీ కార్యాలయానికి పిలిపించి బిల్లు చెల్లించారు. పంచాయతీ కార్యదర్శి సతీష్, రవీందర్, పీరూ తదితరులు ఉన్నారు.

సెప్టెంబరు 1 నుంచి ఎస్జీఎఫ్ పోటీలు షురూ

చేగుంట, న్యూస్‌టుడే: చేగుంటలో ఎస్జీఎఫ్ పోటీలు సెప్టెంబరు 1 నుంచి 3 వరకు నిర్వహించనున్నట్లు ఎంఈవో నీరజ తెలిపారు. శనివారం ఎమ్మార్సీలో ఎస్జీఎఫ్ క్రీడా పోటీలపై పీడీలు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. అండర్-14, 17 బాలబాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక తెలంగాణ ఆదర్శ పాఠశాల ఆవరణ దీనికి వేదిక కానుందని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొలన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మంత్రిగా, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా పదవులు అలంకరించిన ప్రస్తుత నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఈనెల 31న వెల్దుర్తి - మెదక్ రోడ్డును పటిష్ఠం చేయాలని పాదయాత్ర చేపట్టనుండటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్ తదితరులు ఎద్దేవా చేశారు. శనివారం వెల్దుర్తిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరుగుతోందన్నారు. గతంలో పలు రోడ్లను విస్తరించాలని విన్నవించినా పట్టించుకోలేదన్నారు. వెల్దుర్తికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయించానని సునీతారెడ్డి చెప్పడం శోచనీయమన్నారు. వెల్దుర్తి-మెదక్ రోడ్డు పరిస్థితిని ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

22ఏ భూ సమస్యపై నిరసన దీక్ష

నర్సాపూర్: జిల్లాలో 22ఏ కింద చేర్చిన భూములపై నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ భాజపా పోరాటానికి సిద్ధమవుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ తెలిపారు. నర్సాపూర్‌లో సెప్టెంబరు 2న చేపట్టనున్న నిరసన దీక్ష నేపథ్యంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం శనివారం నిర్వహించారు. రైతులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అసంపూర్తి గోదాం.. అందుబాటులోకి వస్తే ప్రయోజనం

నార్సింగిలో అసంపూర్తిగా ఉన్న మార్కెట్ గోదాం

న్యూస్‌టుడే, నార్సింగి(చేగుంట): భవనాల నిర్మాణాలకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేస్తే పూర్తి చేసేందుకు ఆస్కారం ఉంటుంది. అరకొర నిధులు కేటాయిస్తే పనులు అసంపూర్తిగానే ఉంటాయి. నార్సింగిలోని మార్కెట్ గోదాం అదే పరిస్థితి. ఇక్కడ 14 ఏళ్లుగా గోదాం నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని 2011లో అప్పటి దుబ్బాక ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డి నార్సింగిలో మార్కెట్ గోదాంను మంజూరు చేయించారు. గోడలు నిర్మించి పనులు ఆపివేశారు. ఆరు నెలల తర్వాత పైన రేకులు వేశారు. అనంతరం నిధులు లేనికారణంగా నిర్మాణ పనులు పూర్తిగా ఆపేశారు.

14 ఏళ్లుగా..

14 ఏళ్ల క్రితం ఆగిపోయిన పనులు ఇప్పటి వరకు కూడా పూర్తి చేయలేదు. 2014లో జరిగిన ఎన్నికల్లో ముత్యంరెడ్డి ఓటమి చెందటంతో గోదాం నిర్మాణం మధ్యలోనే వదిలేశారు. తర్వాత భారాస ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యేగా ఎన్నికైన వారు దాని గురించి పట్టించుకోలేదు. అసంపూర్తిగా ఉన్న దానిలోనే ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఏటా ఏర్పాటు చేస్తున్నారు. కాని దానిని మాత్రం పూర్తి చేయటం లేదు. నిర్మాణం పూర్తి చేయటానికి రూ. 10 లక్షలు అవసరం ఉంటాయని అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి కాని నిధులు మాత్రం మంజూరు చేయలేదు. ఇన్నేళ్లుగా వెక్కిరిస్తూ ఉన్నా పూర్తి చేసేందుకు మాత్రం చర్యలు చేపట్టడం లేదు. అసంపూర్తిగా ఉన్న దానినే ప్రస్తుతం తక్కువకు రైస్‌మిల్లర్లకు అద్దెకు ఇస్తున్నారు. వర్షాకాలంలో వర్షం నీరు లోపలికి చేరి ధాన్యం తడిసిపోతుంది. కోతులకు ఆవాసంగా మారింది. దీనిని పూర్తి చేస్తే ఐకేపీకి ఆదాయం ఎక్కువగా వచ్చే ఆస్కారం ఉంది. అవసరమైన నిధులు మంజూరు చేసి పూర్తి చేస్తే రైతులకు ప్రయోజనంగా ఉంటుంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు అడుగులు వేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పూర్తి చేయించేందుకు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలపై భారాస ఉద్యమాలు

మాట్లాడుతున్న సునీతారెడ్డి తదితరులు

నర్సాపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై భారాస సెప్టెంబరు 1-8 వరకు దశల వారీగా ఆందోళన చేపట్టనున్నామని ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. నర్సాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... 1న ఛార్జిషీట్ విడుదల, కాంగ్రెస్ వైఫల్యాలపై లోగో ఆవిష్కరణ ఉంటుందన్నారు. 2న ఆరు గ్యారంటీలు, 420 హామీలపై నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు, భారీ ఫ్లెక్సీ ప్రదర్శన ఉంటుందన్నారు. 3న రైతుల సమస్యలపై సదస్సులు, 4న నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. 5న విద్యార్థులు, యువత, ఉద్యోగాలు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాల హామీ గురించి నిలదీస్తామన్నారు. 6న పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం, పల్లె ప్రగతిలో గత ప్రభుత్వం చేసిన గొప్ప పనులు వివరిస్తామని అన్నారు. 7న ప్రజావాణిలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ వినతులు అందజేస్తామని తెలిపారు. వెల్దుర్తి-పిల్లికొట్టాల్ గ్రామాల మధ్య తారు రోడ్డు నిర్మాణానికి ఈనెల 31న పాదయాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు.

నేడు ఏఐటీయూసీ మహాసభ

నర్సాపూర్, న్యూస్‌టుడే: నర్సాపూర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా నాలుగో మహాసభను ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేశవులు, నందం తెలిపారు. శనివారం జరిగిన కార్యక్రమంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐటీయూసీ కార్మికుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తోందన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతోందని విమర్శించారు. పార్టీ నేతలు ఉన్నారు.

తెలుగు భాషతో మనోవికాసం

ముస్లాపూర్‌లో కవుల చిత్ర ప్రదర్శన

మెదక్ టౌన్, అల్లాదుర్గం, కౌడిపల్లి, న్యూస్‌టుడే: భాషతో భావ ప్రకటన ప్రజలకు సులువుగా అర్థం కావడమే తెలుగు భాష గొప్పతనమని అల్లాదుర్గం ప్రధానోపాధ్యాయులు రమేష్ అన్నారు. పాఠశాలలో ప్రముఖ కవి, భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ● మాతృభాష పట్ల ఆసక్తి అభిమానం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని కౌడిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులు పేరాల జ్ఞానానందం సూచించారు. ● తెలుగు భాషతో విద్యార్థులకు మనోవికాసం కలుగుతుందని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులున్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: సీఐటీయూ

నిరసన తెలుపుతున్న జిల్లా కార్యదర్శి మల్లేశం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: క్షేత్ర స్థాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సంగారెడ్డి పట్టణంలోని ఉమ్మడి మెదక్ జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో ఎదుట నిరసన చేపట్టి మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో కార్మికులు ఇబ్బందులు పరిష్కరించాలని పలు మార్లు డీఎల్‌వోకు వినతిపత్రాలు అందజేసిన స్పందించడం లేదని ఆరోపించారు. జిల్లా కార్మిక శాఖ అధికారి సైతం ప్రైవేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: క్రమశిక్షణ, సమయపాలనతో విధులు నిర్వర్తించాలని డీఎస్పీ ప్రసన్నకుమార్ సిబ్బందికి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శనివారం నిర్వహించిన వారాంతపు పరేడ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గౌరవ వందనం స్వీకరించారు. ఆర్ఐ శైలేందర్ తదితరులు ఉన్నారు.

చాకరిమెట్లలో విశేష పూజలు

వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

శివ్వంపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ చాకరిమెట్లలో వెలిసిన సహకార ఆంజనేయస్వామి పుణ్యక్షేత్రంలో శనివారం విశేష పూజలు కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయం వద్ద సందడి నెలకొంది. తెల్లవారుజామున స్వామికి అభిషేకం, అర్చన చేపట్టారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో విశేష సంఖ్యలో సామూహిక వ్రతాలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ ఆంజనేయ శర్మ, ఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు దేవదత్త శర్మ తదితరులు ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్	95730 81675	పెద్దశంకరంపేట 80085 73251
నర్సాపూర్	80085 73222	శివ్వంపేట 8008573227
తూప్రాన్	96762 58144	
చేగుంట	80085 73200	(10AM TO 1 PM)

న్యూస్‌టుడే, శివ్వంపేట: ? శివ్వంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పందులు, వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. అపరిశుభ్రంగా మారింది. గేటు, గోడ ధ్వంసం అయి రంధ్రం ఏర్పడింది. అందులో ఉంచి అవి ఆసుపత్రిలోకి చేరుతున్నాయి. సమస్య పరిష్కరించాలి.
– గ్రామస్థులు, శివ్వంపేట

✓ ఆసుపత్రికి నిధులు రావడం లేదు. ఆసుపత్రి గోడకు భారీ రంధ్రం ఏర్పడి అందులో నుంచి పందులు సంచరిస్తున్నాయి. దాతలు ముందుకు వస్తే సమస్య పరిష్కారం కానుంది.
– సాయి సౌమ్య, వైద్యాధికారిణి, శివ్వంపేట

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

న్యూస్‌టుడే, చిలప్‌చెడ్: ఈ నెల చివరి వరకు పింఛన్లకు అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ప్రశాంత్ అన్నారు. చిలప్‌చెడ్ మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 349 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వింతంతువులు 233, ఒంటరి మహిళలు 28, వికలాంగులు 65, చేనేత కార్మికులు 4, కల్లుగీత కార్మికులు 18మంది పింఛను దరఖాస్తులు చేసుకున్నారని అన్నారు. దరఖాస్తు పూర్తయిన వారి వివరాలను పరిశీలించి అర్హులకు పింఛను మంజూరయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

తూప్రాన్ న్యూస్‌టుడే: తూప్రాన్ పురపాలక పరిధి 9వ వార్డులో రెడ్డి సంఘం భవనం నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు రావెల్లి గ్రామానికి చెందిన మహేష్ యాదవ్ ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజులుగా తూప్రాన్ అధికారులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్పందించి విచారణ చేపట్టాలని నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాన్ని ఆపాలన్నారు.

2న బహిరంగ వేలం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: మెదక్ పురపాలిక పరిధిలోని చికెన్, ఫిష్, మటన్ వ్యర్థాల సేకరణకు ఏజెన్సీల వారికి మెదక్ పుర కార్యాలయంలో సెప్టెంబరు 2వ తేదీన బహిరంగా వేలం వేయనున్నట్లు కమిషనర్ నవీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వచ్చే నెల 1వ తేదీ సాయంత్రం 5.00 గంటలలోపు కొటేషన్స్ సమర్పించాలి. వారికి 2వ తేదీ ఉదయం 11.00 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

Wanted Gujarat based FMCG Chocolate Pvt. Ltd. Co. Need Districts wise Super Stockist, Area wise Distributors & Sales Officers. Ph: 7993608649

శ్రీ లాంచింగ్ ప్రొడక్ట్ బేసిడ్ ఇన్వెస్ట్‌మెంట్, బైనారి బిజినెస్ కాన్సెప్ట్ స్త్రీ/పు. నిరుద్యోగులు, MLM, మార్కెటింగ్ లీడర్స్ లక్షల్లో వీక్లీ టీమ్ సంపాదన. ✆ 7013203996.

FINANCIAL SERVICES

లేక్‌ల్యాండ్ కంపెనీ- అన్ని లోన్లు ప్రాపర్టీ, LAP, బిజినెస్, వ్యవసాయ, టేకోవర్ పర్సనల్, గ్రూప్ లోన్లు @ 7% వడ్డీ. ఏజెంట్లు కావలెను. మంచి కమీషన్. 8961920779

REAL ESTATE

HOUSE FOR SALE

SANGAREDDY

G+1+ Pent House 146 Sq.Yards, East Facing, 20 Years Old, 18000 Rents are Getting, Price 70 Lakhs near Sri Ramakala Mandir Sadasivpet. 6281203188.

LAND FOR SALE

Tamilnadu Arunachala (Tiruvannamalai) 5.87 Acres Sale. Suitable for Ashrams, Institution, Farm Houses. ✆ 9840651404.

జనగాం- హుస్నాబాద్ హైవే దగ్గరలో 1.35 ఎకరం ఎర్ర నేల తూర్పు ఫేసింగ్‌తో 600ft పొడవు 150ft వెడల్పుతో బోర్ & జాలీ ఫెన్సింగ్‌తో అమ్మబడును. పౌల్ట్రీ ఫామ్స్/ ఏ ఫామ్ కైనా/ఏ తోటకైనా అనుకూలం. ✆ 8019095973.

MANGO FARM for sale
12.5 Acres,
RTC Bus Route Road,
Near SIDDIPET- MUSTABAD
"T" JUNCTION,
WITH 3 BORE WELLS.
TOTAL FENCING
PH:9391515600

PLOT FOR SALE

BHEL

Aminpur 160, 200, 400 sq.yd Beeramguda 200, 1500 sq.yd Isnapur 400, 660 sq.yd ShadNagar Villa Plots Sale. ✆ 9392818189

MOKILA

Kondakal HMDA Final Approved 400 Sq.Yds East Facing 40 Ft Road. 40k per Sq Yd. Contact: 8885825757

GENERAL

DTCP & HMDA RERA Apprd fully Devpd Layouts in prime location & Nr.ORR Comm, Semi Comm/ Resi plots. Ph: 7093008007

JOBS

హైదరాబాద్ సిటీలో బ్రాహ్మణ కుటుంబానికి వంట చేయడానికి బ్రాహ్మణ స్త్రీలు కావలెను. జీ॥ 25K-30K, భోజనము+ వసతి కల్పించబడును. వెంటనే. ✆ 9866252220

టైలర్స్ కావలెను. కాజా బటన్, ఫ్రంట్ లోడింగ్, సైడ్ లోడింగ్ టైలర్స్ కావలెను. KPHB కాలనీ. Ph: 9885368888.

ఆర్వి డిజిటల్స్ - తిరుపతి నందు పని చేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్ (ఫోటోషాప్, కోరల్ డ్రా తెలిసిన వారు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 86880 56789.

Exp. ఆయాలు / వార్డ్ బాయ్స్ నర్సులు కావలెను. జీతం: 21000/- నుండి 30,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. Ph: 8096770770/ 9985601234.

WANTED
హైదరాబాద్ లోని ఇబ్రహీంపట్నం దగ్గరలో ఉన్న మా ఫామ్ ల్యాండ్ లో రెండు కుటుంబాలు ఉన్నాయి. వారు వివిధ రకాల పనులు చేస్తుంటారు.
ఆ కుటుంబాలు చేసే పనులు సూపర్‌వైజు చేయడానికి ఒక ఇంచార్జ్ కావాలి.
నెలకు జీతము 30,000.
వయస్సు 25 నుండి 40 సం॥ లు.
అర్హత - ఇంటర్మీడియట్.
ఏదైనా రంగంలో ఇంచార్జ్ కానీ సూపర్వైజర్ గా కానీ పనిచేసిన అనుభవం ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీలు 31-08-26, 01-09-26 & 02-09-26.
టైమింగ్స్ : ఉ. 10 నుండి 6 సా.
ఇంటర్వ్యూ కొరకు ఫోటోలు తీసుకొని రాగలరు.
సంప్రదించండి :
కామినేని హాస్పిటల్ దగ్గర, సూర్యోదయ కాలనీ, L.B.నగర్, హైదరాబాద్. Ph. 7842226933.
Mail : hradmin@sribalajiads.in

MARKETING/ SALES

Medical Representatives in Hyderabad for Sripath Medical Systems Pvt Ltd, send your updated Resume, Y Mahesh, SM, 8500235816, Mail: mahimanne@gmail.com

Wanted kirana and rice shop experience salesman for marketing in Moosapet, Age 35-45 Contact: 9994666666

DRIVERS

Wanted Supervisor at Balanagar and Isnapur locations to Maintain Buses and Cars. Wanted Drivers for Buses and Cars. Contact- 9849470703, 8309790056, 9603248125, 9885302345.

TOURS AND TRAVELS

SEP-15, 12జ్యోతి, 15శక్తి, బద్రీనాథ్, కేదార్నాథ్, గంగోత్రి, యమునోత్రి, గుజరాత్, నేపాల్, డార్జిలింగ్, అస్సాం, కామాఖ్య, కాశీ, రామేశ్వరం బస్ 40వేలు. ✆ 9848782131

ఖర్చు తక్కువ ఫలితం ఎక్కువ
మెదక్ జిల్లా క్లాసిఫైడ్ ప్రకటన 5 లైన్లకు కేవలం (B/W 285, Colour 335) మాత్రమే.
★ 5% GST అదనం
సంప్రదించండి:
9000014771

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అవగాహన లోపం... రైతులకు శాపం

న్యూస్‌టుడే, హవేలిఘనపూర్: ప్రస్తుతం రైతులు వరి పొలాల్లో యూరియా తీసుకునేందుకు నానా అవస్థలు పడుతూ రోడ్ల మీదకు వస్తున్నారు. ఈ క్రమంలో యూరియా బుకింగ్ యాప్‌లపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో యూరియా అమ్మకాలు జరిగినా దాని కోసం నానా తిప్పలు పడుతున్నారు. కానీ ద్రవ రూపంలోని నానో యూరియాపైపై ఆసక్తి చూపడం లేదు. దీని వినియోగం పెంచాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వాలు ఇలా కొరత సృష్టిస్తున్నాయని రైతులు విమర్శిస్తున్నారు. నానోపై గ్రామాల్లో అన్నదాతలకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించడంతో విఫలం అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు దుకాణదారుల డీలర్లు అన్నదాతలకు నానో యూరియా, డీఏపీ వాడితే ఖర్చులు తగ్గుతాయని, దిగుబడి ఎక్కువగా పొందవచ్చని తెలిపినా... వారు ససేమిరా అంటున్నారు. సాధారణంగా యూరియా తయారీకి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు రూ. కోట్లలో ఉంటున్నాయి. ఇది కూడా ఆర్థికంగా భారం అవుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ద్రవరూపంలోని యూరియా వినియోగం పెంచాలని ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు క్షేత్రస్థాయిలో ఫలించడం లేదు. దుకాణాల్లో గతేడాది నానో యూరియా డబ్బాలు అనుకున్నంతా స్థాయిలో కొనుగోలు జరగడం లేదు.

వాడే విధానం...

నానో యూరియా లీటరు నీటికి 4 మీ.లీ. కలిపి వాడుకోవచ్చు. సీసాను చేతిలో పట్టుకుని పోవచ్చు. రవాణా ఖర్చులు కూడా ఉండదు. సీసాలు నిల్వ చేయడం కూడా సులువే. గంటల తరబడి వరుసలో ఉండాల్సిన అవసరం ఉండదు. అయితే నానో యూరియాను పురుగు మందులతో కలిపి పిచికారీ చేయడానికి వీల్లేదు. మరోవైపు 45 కిలోల యూరియా ధర. 266 నుంచి రూ. 300 వరకు అమ్ముతున్నారు. నానో యూరియా అరలీటర్‌కు రూ. 225 ఉంది. ఇది యూరియా బస్తాతో సమానం.

అవగాహన కల్పించాలి

గ్రామాల్లో యూరియా లభించని సందర్భాల్లో చాలా ఇబ్బందులు పడుతున్నాం. దిగుబడి ఎలా ఉంటుందో అనే ఆందోళన నానో యూరియా, డీఏపీ ఇప్పటికీ వాడడం లేదు. వ్యవసాయాధికారులు తరచూ అవగాహన కార్యక్రమాల చేపట్టి రైతులను ప్రోత్సహించాలి. క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా వాడకం గురించి రైతులకు సూచించాలి. అప్పుడే నమ్మకం పెరిగి నానో యూరియా వినియోగంలోకి వస్తుంది.
- మణికంఠ, బూర్గుపల్లి

బాధ్యతతో పని చేయండి..

ఆహార పదార్థాలను పరిశీలిస్తూ..

నర్సాపూర్, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా మైనార్టీల సంఘం ఛైర్మన్ సూఫీజాని, జిల్లా సంక్షేమ అధికారి ఉపేందర్‌లు సూచించారు. నర్సాపూర్‌లోని మైనార్టీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను శనివారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వంటగది, నిత్యావసర సరకుల నిల్వలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. భోజన నాణ్యతను, విద్యా ప్రమాణాలు, ఆరోగ్య సంరక్షణ చర్యలు, వసతి గృహ వసతులను పరిశీలించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మురళీ తదితరులున్నారు.

తూప్రాన్ అభివృద్ధికి సమష్టి కృషి

మాట్లాడుతున్న పురపాలిక ఛైర్‌పర్సన్ రజిని

తూప్రాన్ న్యూస్‌టుడే: తూప్రాన్ పురపాలక అభివృద్ధికి పాలకవర్గ సభ్యులమంతా సమష్టిగా కృషి చేస్తున్నామని పురపాలక ఛైర్ పర్సన్ బొంది రజని పేర్కొన్నారు. శనివారం పురపాలక కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి డంపింగ్ యార్డ్‌లో అసంపూర్తి పనులను పూర్తి చేయడం, చెరువు కట్టపై ఓపెన్ జిమ్‌లకు మరమ్మతులు, కోతులు కుక్కల నివారణకు చర్యలు తీసుకోవడం వంటి తీర్మానాలను చేశారు. తూప్రాన్ పురపాలక వైస్ ఛైర్ పర్సన్ సమతా రెడ్డి, కమిషనర్ రమేష్ కుమార్, కౌన్సిలర్లు ఉన్నారు.

వీబీ జీ రాంజీతో ప్రగతి పనులు

ముత్తాయిపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆనంద్

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: వీబీజీ రాంజీ పథకంలో భాగంగా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని హవేలిఘనపూర్ ఎంపీడీవో ఆనంద్ అన్నారు. శనివారం మండల పరిధి ముత్తాయిపల్లి, బొగుడ భూపతిపూర్ గ్రామాల్లో గ్రామసభను నిర్వహించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు సీసీ దారుల, మురుగు కాలువలు, పాఠశాల భవనాలు, పశు వైద్యశాలలు, ఇంకుడు గుంతలు వివిధ రకాల పనులను వీబీజీ రాంజీ పథకం ద్వారా చేయవచ్చన్నారు. సర్పంచులు లక్ష్మీనారాయణ, పోశెట్టి, ఈసీ ఫణీంద్ర ఉన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ

పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఎన్‌సీసీలో చేరడంతో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం కలుగుతుందని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్ పేర్కొన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీలో చేరేందుకు నిర్వహించిన ఎంపిక పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పరుగు, పుషప్, బార్ పుషప్ వంటి పోటీలను నిర్వహించగా... 50 మంది విద్యార్థినులు, 44 మంది విద్యార్థులు ఎన్‌సీసీలో చేరారు. ఈ పోటీల పర్యవేక్షకులుగా సంగారెడ్డికి చెందిన ఆర్మీ అధికారులు నాయక్ సుబేదర్, అప్పాజీ, హవల్దార్ అమిత్‌రాయ్ వ్యవహరించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి సురేందర్‌రావు, తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మనోహరాబాద్, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తూప్రాన్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కీర్తన అన్నారు. శనివారం మనోహరాబాద్ మండలంలోని రంగాయిపల్లిలో గ్రామ సర్పంచి భాగ్యలక్ష్మీతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంతాల సర్పంచులు, పాలకవర్గం సభ్యులతో కలిసి కార్డులు అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చేగుంట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేగుంట ఎస్ఐ చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. మాసాయిపేట మండలం పోతన్‌శెట్టిపల్లికి చెందిన చేపూరి దాసు (46) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 22న తూప్రాన్‌కు వెళ్లి, తిరుగు పయనమయ్యాడు. మార్గమధ్యలో మాసాయిపేట వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోగా తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు అతడిని ములుగు సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దాసు సోదరుడు వెంకటి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

యువకుడికి తీవ్ర గాయాలు

తూప్రాన్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అడవి పందుల గుంపు అడ్డు రావడంతో ఓ యువకుడు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేటకు చెందిన షేక్ పాషా సీసీ కెమెరాలను బిగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం రాత్రి తూప్రాన్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. తూప్రాన్ పరిధి రావెల్లి శివారులో అడవి పందుల గుంపు ఒక్కసారిగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. పాషా కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

రహదారులపై పశువుల ర్యాంప్‌వాక్

మండలంలోని మంబోజిపల్లి నుంచి బొమ్మట్‌పల్లి పోయే మార్గంలో ఎల్లాపూర్ వంతెనపై నుంచి ప్రతిరోజు పశువులు దర్జాగా సంచరిస్తుండంతో వాహనదారులు బెంబేలెత్తి పోతున్నారు. వేగంగా వెళ్లే వాహనాలు వీటిని తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. కొల్చారం చెందిన వ్యక్తి గేదెను తప్పించే క్రమంలో కొమ్ములో ఇరుక్కుని అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మెదక్ రూరల్

ప్రతిపాదనలు పంపించారు.. పనులు మరిచారు

మండల కేంద్రమైన టేక్మాల్ శివారు మీదుగా ప్రవహిస్తున్న గుండువాగు కాలువ అవతలి వైపు ఉన్న వ్యవసాయ క్షేత్రాల రైతులు గతేడాది తలకొంత డబ్బులు పోగు చేసి వాగుపై వంతెన నిర్మించారు. టేక్మాల్-జోగిపేట తారు రోడ్డు నుంచి వాగు పై ఉన్న వంతెనను చేరుకోవచ్చు. కానీ ఇక్కడ వంతెన సరిగా ఉన్నా దాని చేరుకుని తారు రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. వ్యవసాయ క్షేత్రాలకు ఎరువులు తీసుకెళ్లేందుకు, పనుల కోసం వెళ్లే రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. అధికారులు గతంలో ప్రతిపాదనలు పంపించారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి మార్పు లేదు. - న్యూస్‌టుడే, టేక్మాల్

లేగ దూడపై చిరుత దాడి

తూప్రాన్, న్యూస్‌టుడే: తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో చిరుత దాడికి పాల్పడిన ఘటన శనివారం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గుండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ రోజులాగే శుక్రవారం పొలం వద్ద ఉన్న పశువుల పాకలో లేగ దూడను కట్టేశాడు. శనివారం ఉదయం వెళ్లి చూడగా దూడ కళేబరం కనిపించింది. చిరుతే దాడి చేసినట్లుగా అటవీ అధికారులకు తెలియజేయగా వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అటవీ ప్రాంతానికి వెళ్లవద్దని గ్రామస్థులకు సూచించారు. గతంలోనూ పలుమార్లు దూడలను బలిగొన్నాయని, అధికారులు స్పందించి చిరుతలను ఇతర ప్రాంతాలకు తరలించాలని గ్రామస్థులు కోరారు.

(c) eenadu